

# మనిషి

ఇచ్ఛాపురపు రామచంద్రం

క్రీచురాళ్ళు గీపెడుతూంటే! శ్మశానాన్ని చీకటి జోగొట్టుతోంది. కీచురాళ్ల ఆరుపుల మినహా అక్కడ ఇంకే శబ్దమూ వినరావడంలేదు ఉండీ ఉడిగి వేస్తున్న గాలికి జిల్లేళ్ళు తమ ఉనికిని నిరూపించుకుంటూ తలలూపుతున్నాయ్.

ఘోరీలనడుమ ఉన్నట్లుండి కొవ్వొత్తి వెలిగింది. నల్లని చీకటిలో ఎఱ్ఱని వెలుగు భయంకరంగా మెరిసింది. ఆ వెలుతురులో ఆజానుబాహుండైన మనిషి తలవంచి తుప్పల నడుమ దేనికోసమో అన్వేషించసాగేడు.

గల్లున మోత....నిశ్శబ్దంలో గుసగుసలాడినట్లు మోగింది కొవ్వొత్తి ఆరి వెలుగు పోయింది. మళ్లీ అంతటా చీకటి ఆవరించింది. ఆవరించిన అంధ

కారంలో అతను అలవాటుగా నడుస్తున్నాడు. చీకట్లోనే భయం గొలుపుతుంది. అతని ఆకారం చేతిలోని సంచీ మొలలో దోపుకున్నాడు. వడివడిగా ఊరివంక అడుగులు వేయసాగేడు.

ఎక్కడో దూరాన అర్ధరాత్రిని సూచిస్తూ వరుసగా పన్నెండు గంటలు మోగేయ్. నిన్నరాత్రి యిదే సమయానికి ఎక్కడా కన్నం పారక కనపడిన యింట్లో దూరేడతను. కనీసం కడుపైనా నింపుకో వచ్చునన్న ఆశతో, అతనికి తెలుసు ఆ యింట్లో అన్నంతప్ప ధనరాసులు దొరకవని.

వంటింటితో సరిపెట్టడం అలవాటు లేని పనికనుక అతని అడుగులు పడక గదిలోకి దారితీశాయ్.

బరువెక్కిన చేయి – శ్మశానంలో తేలికపడింది.

ఒకటికాదు రెండుకాదు – వెయ్యి రూపాయలు !

అతని కాశ్చర్యం వేసింది.... నమ్మకం లేక మరోసారి చూశాడు.

అవి రూపాయలే ! వెయ్యి ఉండటం కూడా నిజమే !!

అతని మెదడులో అనేక కోరికలు రేగేయ్.

విజయవాడలో-విలాసాల కొటపట్టయిన ఆ హోటల్లో-ఆనాటి అందగత్తె-అతని ఆలోచనల్లో నర్తించింది. ఆమని నందించే మధువు అతని మనసుని ఊరించింది. ఆమె అందించే సౌఖ్యం అతన్ని ఆరాటపెట్టింది.

భద్రంగా సంచిని జిల్లేడు పొదలో పాముపుట్టల నడుమ ఎండుటాకులదిగువ



జాగ్రత్తచేసి మనసులోని ఆరాటం తగ్గేందుకు తోవలో నాలుగు గ్లాసుల సారా తాగి గుడిసెలో పడుకున్నాడు.

అనుకున్న ప్లానంతా భగ్నమైంది.

ఉదయం ఏడెనిమిదికికాని మెలకువ రాలేదు. అప్పుడు డబ్బుతో బస్సెక్కితే తనను అనుమానించడం తథ్యమని తెలిసి బద్ధకంగా మిద్దెక్కేక టీనీళ్లు కవి ఊళ్లోకి బయలుదేరాడు. తిరిగి రావడంలోనే జరిగింది జరగకూడని సంఘటన. నలుగురు మనుషులు నిలదీసి అడుగుతున్నారతన్ని అతను చెబుతున్నాడు. "వెయ్యి రూపాయిలు వసూలు చేసిన మాటా ఇంటికి తెచ్చిన మాటా నిజమే. అవి పెట్టెలో పెట్టి పడుకున్నాను. ఉదయం లేచి చూస్తే" అతని తల్లి వరండాలో ఆ మూల కూర్చుని ఏడుస్తోంది. తను నిరపరాధినని మొరపెట్టుకుంటున్నాడు. ఈలోగా పోలీసులు రానేవచ్చారు. అందరూ చోద్యం చూస్తున్నారు. పోలీసులు బేడీలు వేశారతని చేతులకి. ఆ తల్లి ఏడుపు స్వరం పెంచుకుంది. అతన్ని తీసుకుపోయారు సర్కారువారి సొమ్ము తెల్లించనందుకు.

అతల్లినెవరూ ఓదార్చడంలేదు.

అందరూ కదిలిపోయారు....వారితో పాటే తనూ....

ఎంతకాలం వెళ్ళినా ఆమె రాగం తన హృదయంలో మార్మోగడం మానలేదు. ఆమె కంఠం తన హృదయంలో వెక్కివెక్కి పలహోగింది....అలా జరిగి మన్నాళ్లా తన గుండెలు దడదడ లాడటం మానలేదు.

హృదయ విదారకమైన ఆమె దుఃఖం తన గుండెల్ని కరగించివేసింది....

మధువూ - మానినీ - వాటి స్థానంలో ఆ మాతృమూర్తి దీనారావం ఆక్రమించుకుంది.

అతను నడుస్తున్నాడు కంపిస్తున్న అడుగులతో.

ఊరి పొలిమేరలకి బీటుపోలీసుల బూట్లచప్పుడు అస్పష్టంగా వినిపిస్తోంది.

ఒణుకుతున్న పాదాలు - చీకటిలో దూసుకుపోతున్నాయ్.

ఆ యిల్లు అదే యిల్లు....

అట్టే ఎత్తులేని ప్రహారీగోడ అతని ముందు తన అల్పత్వాన్ని అతిసులభంగా అంగీకరించింది.

అతను లోపల ప్రవేశించాడు.

బయట పోలీసుల ఈలలు. బూట్ల చప్పుడు.

అతను తొందరగా తలుపు తెరచాడు ఒక్క లిప్త అదృశ్యం ఆతని నేత్రాల ముందు మెరిసింది. కళ్లు చీకట్లు కమ్మాయ్. అతను వెనుదిరిగేడు.

నాలుగు లాఠీలు తలమీద పడ్డాయ్.

"అమ్మా!" ఆఖరి పిలుపు పిలిచి నేలగూలిపోయాడు.

విజయగర్వంతో బూటు కాలితో తన్నేడు పోలీసు. నాణాల మూట ఘల్లు మంటూ విడిపోయింది.

పోలీసు కర్థంకాలేదు.

మరొకడెవడో కేకలుపెడుతున్నాడు "లోపల ముసిల్ది ఉరిపోసుకు చచ్చింది"

ఆకాశం అంతా చీకటితో నల్లగా ఉంది.

ఏశబ్దమూలేకుండా ప్రశాంతంగా ఉంది.

ఉండీ ఉడిగీ చుక్కలు మెరుస్తున్నాయ్....

★